సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

గిరిజా కాలనీలో స్వచ్ఛభారత్



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డీబీఆర్‌సీ సభ్యులు

పెదగంట్యాడ: దళిత బహుజన రీసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో మండలంలోని గిరిజా కాలనీలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే వేస్ట్ పిక్కర్స్‌కు పరిశుభ్రత గురించి వివరించారు. వారి జీవనోపాధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నిఖిల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ పరిధిలోని పెదగంట్యాడ క్లస్టర్ పరిధిలో అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి ప్రాజెక్ట్ అధికారి డి.నీలవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో మొత్తం 7 పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. 7వ తరగతి పాసై 21 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల లోపు మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేయాలన్నారు.

జర్నలిస్టులకు సామాజిక స్పృహ అవసరం



జర్నలిస్టులకు కానుక అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: జర్నలిస్టులు సామాజిక స్పృహతో వార్తలు రాయాలని, వార్తలు రాసే ముందు నిజా నిజాలను నిర్ధారించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం దసరా సంబరాలు నిర్వహించారు. సీపీ శంఖబ్రత బాగ్చి, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి జర్నలిస్టులకు దసరా కానుకలు పంపిణీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే గాజువాక అధ్యక్షుడు పరశురామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాము, రామచంద్రావు, హరినాథ్, వాసు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



అగనంపూడిలో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: పింఛన్ల పంపిణీలో అవకతవకలకు తావులేకుండా చూస్తున్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 79,85 వార్డులకు చెందిన పింఛన్‌దారులకు బుధవారం అగనంపూడిలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, కర్రి దశేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో రెండో రోజూ విశేష పూజలు



శారదామాతకు పూజలు చేస్తున్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో బుధవారం భక్తులు స్వహస్తాలతో కుంజర మహాగణపతి, శ్రీ శారదామాత అమ్మవారికి, శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా కుంకుమపూజలు, సహస్రనామార్చన, భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, వస్త్రాలంకరణ, పల్లకీ సేవ, బాబా వారి గీతాలాపన (భజన), పుణ్యాహవచనం, నవగ్రహారాధన, పంచగవ్యం, వాస్తుపూజ, సాయినాథ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. దసరా పర్వదినం, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం మహాన్నదానం అనంతరం బాబా వారి 107వ మహాసమాధి (పుణ్యతిథి) సందర్భంగా భక్తుల స్వహస్తాలతో దీపారాధన జరుగుతాయని, కాశీ హరిద్వార్ నుండి తీసుకొచ్చిన పంచముఖి రుద్రాక్షలను బాబాకు అభిషేకించిన తర్వాత భక్తులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. వీటితో పాటు కంకణాలు, సాయిబాబా ఫొటో భక్తులకు అందించనున్నట్లు తెలిపారు.

కరుణించు దుర్గమ్మా



నెల్లిముక్కులో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



పాత అగనంపూడిలో మహా చండీదేవి రూపంలో దుర్గాలమ్మ



అమ్మవారి సారె, ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు



మహిషాసురమర్దినిగా మహాదుర్గ, ఐశ్వర్యలక్ష్మి అవతారంలోమహాలక్ష్మి

పెదగంట్యాడ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదో రోజు అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. బాలచెరువు ఉమారామలింగేశ్వర ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారిని ఆలయ అర్చకుడు వాసదేవశర్మ మహిషాసుర మర్దినిగా అలకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నెల్లిముక్కులో అన్నదానం..

యాత శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నెల్లిముక్కులో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, న్యాయవాది అండిబోయిన లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో అండిబోయిన అప్పారావు, పులి రమణారెడ్డి, నాగేశ్వరరావు, అండిబోయిన వెంకటరమణ, రొంగల నూకరాజు, దొమ్మేటి అప్పారావు పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా దుర్గమ్మ

అగనంపూడి: దుర్గాదేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని అగనంపూడి నిర్వాసితకాలనీ ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు నాగేశ్వరరావు, ఇల్లపు వరలక్ష్మి, కర్రి దశేంద్ర, కోసూరి తాతారావు, గొల్లవిల్లి కనక భవానీ, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

• 86వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీలో నిర్వహించిన అన్న సమారాధనను వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పూర్ణానందశర్మ (పూర్ణ) ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకొని విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వార్డు ప్రధాన కార్యదర్శి సుధీర్ పాల్గొన్నారు.

• దిబ్బపాలెం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఘటాలు, సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. దిబ్బపాలెం, బొరమ్మపాలెం, పెద్దినాయుడపాలెం, శనివాడల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఇల్లపు జువ్వాలు, యలమంచిలి అప్పారాఉవ, ఈగల నరసింగరావు పాల్గొన్నారు.

• పాత అగనంపూడిలోని దుర్గాలమ్మ అమ్మవారు మహర్నవమిని పురస్కరించుకొని మహా చండీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపించారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి పారాయణం పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో విశేష పూజలు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాదుర్గ అమ్మవారు మహిషాసురమర్దినిగా, మహాలక్ష్మి అమ్మవారు ఐశ్వర్యలక్ష్మిదేవి అవతారంలో, మహాసరస్వతి అమ్మవారు తెలుపు వర్ణం చీరలో బుద్ధిధాత్రి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవార్లకు సహస్ర ఫలార్చనచేశారు. సాయంత్రం సామూహిక సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



శ్రీరామ్‌నగర్‌కాలనీలో అన్న సమారాధనను ప్రారంభిస్తున్న వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పూర్ణ



బర్మా కాలనీలో మహిషాసురమర్దినిగా దుర్గాదేవి



ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు



బుద్ధిధాత్రి అలంకరణలో మహా సరస్వతి

మార్కెట్ కళకళ

దసరా సందడి

- రూ.10 కోట్ల వరకూ లావాదేవీలు
- నాన్‌వెజ్ దుకాణాల వద్ద రద్దీ
- కిటకిటలాడిన మద్యం దుకాణాలు



స్వీట్స్ దుకాణం వద్ద విక్రయాలు



షాపింగ్‌మాల్ వద్ద రద్దీ



పూలదుకాణం వద్ద రద్దీ

గాజువాక: గాజువాక మార్కెట్లు దసరా శోభను సంతరించుకున్నాయి. కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడాయి. జనం తాకిడితో గాజువాక మెయిన్ రోడ్డు, బీసీరోడ్, కణితి రోడ్‌లు రద్దీగా మారాయి. వస్త్రాలు, స్వర్ణాభరణాలు, వివిధ మోడళ్ల ద్విచక్ర వాహనాలు అందుబాటులో ఉంచడంతో పాటు ఆఫర్లను ప్రకటించడంతో కొనుగోలుదారులతో నిండుగా కనిపించాయి.

వినియోగదారులను ఆకట్టుకునేలా ..

• వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాళ్లలో వినియోగదారులను ఆకట్టుకునేందుకు నిర్వాహకులు రాయితీలతోపాటు స్పాట్, డ్రా గిఫ్టులు ఏర్పాటు చేశారు. వినియోగదారుల అభిరుచులకనుగుణంగా వస్త్ర వ్యాపారులు వివిధ మోడళ్ల వస్త్రాలను తీసుకొచ్చి ప్రత్యేక రాయితీలతో విక్రయించడంతో షాపులు రద్దీగా మారాయి. ఇవే కాకుండా ఫుట్‌వేర్, ఫర్నిచర్ దుకాణాలలో పండుగ శోభతో సందడి నెలకొంది. ఈ పండగ సీజన్‌లో రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వ్యాపారాలు జరిగినట్టు తెలుస్తోంది. బుధవారం రాత్రి 10 గంటలు దాటినా కొనుగోళ్లు కొనసాగాయి.

మిఠాయిలకు గిరాకీ

• దసరా పండగలో మిఠాయిలదే అగ్రస్థానంగా ఉంటుందన్న విషయం తెలిసిందే. వ్యక్తులు, సంస్థలు ఈ పండుగకు మిఠాయిలు ఇచ్చి శుభాకాంక్షలు చెబుతారు. దీంతో గాజువాకలో మిఠాయిలు విక్రయించే దుకాణాల నిర్వాహకులు కొనుగోలు దార్ల రద్దీని తట్టుకోవడానికి టెంట్‌లను ఏర్పాటు చేసి అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ముందుగానే పండగ

• చాలా ప్రాంతాల్లో ఒక్కరోజు ముందుగానే దసరా సందడి మొదలైంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి కావడం, ఆదేరోజు దసరా రావడంతో మటన్, మందు, చికెన్ షాపులను మూసివేయనున్నారు. దీంతో కొందరు గురువారం కోసం మందు, మటన్, చికెన్ కొనుగోలు చేసి పెట్టుకున్నారు. ఈ కారణంగా మటన్, చికెన్ షాపులముందు జనం బారులు తీరారు.

రికార్డు స్థాయిలో లిక్కర్ అమ్మకాలు

• ఇదిలా ఉండగా, అక్టోబర్ 2న మద్యం దుకాణాలకు కూడా సెలవు కావడంతో మద్యం ప్రియులు ముందుజాగ్రత్తగా మందు కొనుగోలు చేసి ఉంచుకున్నారు. బుధవారం ఒక్కరోజే కోటి నుంచి కోటిన్నర రూపాయల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు పేర్కొన్నారు. సాధారణ రోజుల్లో గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 35 మద్యం దుకాణాలద్వారా రూ.70 లక్షల వరకు విక్రయిస్తారు. పండగ కారణంగా ఒక్కసారిగా అమ్మకాలు పెరిగినట్టు అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి మద్యం దుకాణాల మందు మందుబాబులు బారులుతీరడం కనిపించింది.

ధరల మోత

• దసరా పూజ సామాగ్రి ధరలు కొండెక్కాయి. ఒక్క కొబ్బరికాయ ధర రూ.50 నుంచి రూ.70 పలికింది. డజను అరటిపళ్లు (చిన్న సైజు) రూ.100 దాటిపోయింది. నిమ్మకాయల ధర సైతం అదే విధంగా పెరిగింది. గుప్పెడు మామిడాకుల ధర రూ.20. రెండు పూలు రూ.30 పైమాటే. ఇక మిగిలిన సామగ్రి ధరల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పూల ధర కేజీపై ఒక్కసారిగా రూ.240 పెంచి విక్రయించారు.

విజయానికి ప్రతీక విజయదశమి



అఫీషియల్ కాలనీలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకొంటున్న సీఐ పార్థసారథి, నాయకులు

గాజువాక: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని గాజువాక సీఐ పార్థసారథి అన్నారు. శ్రీనగర్ అఫీషియల్ కాలనీలో ఎల్‌జీ దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గ అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భవానీ భక్తులకు ఆయన చేతుల మీదుగా అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నిర్వాహకుడు బొత్స దిలీప్ కుమార్, నాయకులు రంగ నాయకులు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, కమిటీ ప్రతినిధులు జగదీష్, తేజ, సంతోష్, మధు, సావిత్రి పాల్గొన్నారు.

అదానీ సంస్థలపై ఇంత ప్రేమెందుకు?

ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జేటీ రామారావు సూటి ప్రశ్న



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట: పెదగంట్యాడలో అదానీ గ్రూపునకు చెందిన అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ని రద్దు చేయాలని, ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే నిలిపేయాలని ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జేటీ రామారావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గుజరాత్, హర్యానా, తెలంగాణలో అదానీ గ్రూపు సిమెంట్ పరిశ్రమలు మూతపడుతున్నా ఏపీలో మాత్రం పోలీస్ పహారాలో జనావాసాల మధ్య ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. కేవలం గుజరాత్ ప్రభుత్వానికి ఉన్న అనుమతులను బూచిగా చూపి ఏపీలో పరిశ్రమలు పెట్టడానికి ఏ రకంగా ముందుకు వస్తారని రామారావు అన్నారు. క్లింకర్, జిప్సం, ఫ్లైయాష్, స్లాగ్, బొగ్గు వంటి వ్యర్థాలు విడుదలవుతాయని అన్నారు. ఎస్‌వో2 వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అలాగే కార్బన్, ఇతర వస్తువుల వల్ల భూగర్భ జలాలు దెబ్బ తింటున్నాయన్నారు. రైతులు, మత్స్యకారులు గంగవరం పోర్టు కోసం భూములిచ్చారే గానీ సిమెంట్ పరిశ్రమ కోసం కాదన్నారు. గుజరాత్ ప్రభుత్వం అనుమతులతో ఈ ప్రాజెక్ట్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె. రామచంద్ర మూర్తి, ఆర్. తాతారావు, బి. నీలకంఠం, ఎస్. జగదీష్, వద్దాది శివ, జి. సుమతి, బి. రాంబాబు, జె. ఫణి ప్రియాంక, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



వాక్‌థాన్‌లో పాల్గొన్న డీఆర్‌ఎం, అధికారులు

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, ప్రయాణికులు, ప్రజల్లో స్వచ్ఛతా ఉద్యమంపై అవగాహన కల్పించేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బొహ్రా నాయకత్వంలో వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. రైల్వే ఇండోర్ స్టేడియం నుండి డీఆర్‌ఎం కార్యాలయం మీదుగా రైల్వే స్టేషన్ వరకు ఈ వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛత అనేది కేవలం బాహ్య శుభ్రత మాత్రమే కాదని, దీనిని ఒక అలవాటుగా చేసుకుని ఆరోగ్యకరంగా జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్), ఈ. శాంతారాం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ ప్రవీణ్ భటి, సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్, స్పోర్ట్ ఆఫీసర్ ఎం. హరనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



వైద్యుడు కృష్ణంరాజుకు వీడ్కోలు పలుకుతున్న నాయకులు

అగనంపూడి: డాక్టర్ వేటూరి కృష్ణంరాజు నిరుపేదలకు రెండు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించి వయోభారం వల్ల స్వగ్రామం భీమవరం వెళ్లిపోతున్న సందర్భంగా బుధవారం దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రజాసంఘాల నాయకులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. నాయకులు పట్టా రామ అప్పారావు, గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి వారి మన్ననలు చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఈపూరి బుచ్చిరాజు, లక్కరాజు రాము,బొండా ఈశ్వరరావు, సురేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా కుమారి పూజ



కుమారి పూజలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-2 సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం కుమారి పూజ (కన్య పూజ) వైభవంగా జరిగింది. దివ్య నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లలితా పారాయణం, నవమి పూజ, కన్యాపూజ, దేవి శతనామావళి, శాంతి పూజ శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం మంగళ హారతి, ప్రసాద వితరణ చేశారు.

ముడుపు సొమ్ము చోరీ

టోల్‌గేట్ కార్యాలయంలో ఘటన

తగరపువలస: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి కోసం పక్కన పెట్టిన సుమారు రూ.లక్ష నగదును చోరీ చేశాడు ఓ ఘనుడు. భీమిలి మండలం బోడమెట్టపాలెం-జొన్నాడ టోల్‌గేట్‌లో గత నెల 30వ తేదీ వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివి.. రాజస్థాన్‌కు చెందిన టోల్‌గేట్ టెండరుదారుడు ప్రతి రోజూ ఒకటో తేదీ నుంచి రోజుకు మూడు షిఫ్టులలో రూ.వెయ్యి వంతున రోజుకు రూ.3వేలు హుండీలో వేసి నెలాఖరున రూ.లక్ష అయిన తరువాత తిరుపతి వేంకటేశ్వరస్వామి హుండీలో కానుకగా వేస్తుంటారు. అదేవిధంగా సెప్టెంబరు హుండీ ఆదాయాన్ని పక్కన ఉంచారు. అయితే, గుర్తు తెలియని వ్యక్తి, మంగళవారం తెల్లవారుజామున హెల్మెట్ ధరించి ఆఫీసులోకి ప్రవేశించి ఆ నగదు దొంగిలించాడు. టెండరుదారుడి ఫిర్యాదు మేరకు భీమిలి క్రైం పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించి, నగదు రికవరీ చేశారు. ఎస్‌ఐ సూర్యప్రకాష్ నిందితుడిని భీమిలి స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న డాక్టర్ కేజీ వేణు

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు కె.జి.వేణు మాట్లాడుతూ కవిత్వం, కమనీయ రసాత్మక సాహిత్య ప్రక్రియ అన్నారు. కవి ప్రతిభకు కవితా రీతులు, కవిత్వ పటుత్వం గీటురాళ్లు అన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కవిత్వ తత్వాన్ని వివరించారు. అనంతరం పలువురు కవులు తమ స్వీయ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణమూర్తి, చల్లా రాంబాబు, సోమంచి వినయభూషణరావు, డి.ఎస్.కుమార్, సీహెచ్ చినసూర్యనారాయణ పాల్గొన్నారు.